
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 22 । ఆగస్టు । 2024





**11,710 క్యూసెక్కుల వరద**

సోమశిల: జలాశయానికి 11,710 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. జలాశయం బుధవారానికి 26.92 టీఎంసీలకు చేరుకుంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.73,900 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.6,687 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.6,887 |
| నవర (8 గ్రాములు) | రూ.55,096 |


గరిష్టం/కనిష్టం
37.5 /28.1

**వాతావరణం**

గాలిలో తేమ 66 శాతంగా బుధవారం నమోదైంది. జిల్లాలో వాతావరణం గురువారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

# కుదరని సర్దుబాటు

**ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. తాము అధికారంలోకి వస్తే ఉపాధ్యాయులకు అనుకూలంగా వ్యవహరిస్తామని హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం సర్దుబాటు ప్రక్రియలో వారిని సంతృప్తి పర్చలేకపోతోంది. ఇప్పటికే ఈ ప్రక్రియకు సంబంధించి రెండు సార్లు మార్గదర్శకాల్లో మార్పు చేసినా ఉపాధ్యాయుల డిమాండ్‌కు అనుగుణంగా వ్యవహరించలేకపోతోంది. ఉపాధ్యాయుల డిమాండ్లు, అభ్యంతరాలపై రాష్ట్ర ప్రభుత్వం కూడా తన నిర్ణయాన్ని మార్చుకునే పరిస్థితిలో లేక ఇప్పటికే ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారమే కౌన్సెలింగ్ ప్రక్రియతో ముందుకు వెళ్తోంది. ఈ పరిణామాలతో ఉపాధ్యాయులు, రాష్ట్ర ప్రభుత్వం మధ్య అగాధం పెరుగుతోంది.**




నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ సా...గుతూ ఆలస్యమవుతోంది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయి. 117 జీఓను రద్దు చేసి సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలన్న ఉపాధ్యాయుల డిమాండ్‌ను ప్రభుత్వం తోసిపుచ్చడంతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ నెల 8న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియకు జీఓ విడుదల చేసి 12వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. అయితే ఉపాధ్యాయ సంఘాలు పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేశాయి. దీంతో మార్గదర్శకాల్లో స్వల్ప మార్పు చేసి ఈ నెల 17వ తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. అయినా ఉపాధ్యాయుల అభ్యంతరాలతో కౌన్సెలింగ్ ఆలస్యమవుతోంది. తొలుత మండల పరిధిలో సర్దుబాటు పూర్తి చేసి అక్కడ మిగిలిన వారిని డివిజన్ పరిధిలో పక్క మండలంలో సర్దుబాటు చేయాల్సి ఉంది. డివిజన్ స్థాయిలో మిగులు ఉపాధ్యాయులు ఉన్నట్లయితే జిల్లా స్థాయిలో సర్దుబాటు చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. రోజుకో నిబంధన సృష్టించి ఉపాధ్యాయులను మానసిక అశాంతికి గురి చేస్తోంది. దీంతో మిగులు ఉపాధ్యాయులకు నెల రోజులకు పైగా కంటి మీద కునుక లేకుండా పోయింది.

### కుంటుపడుతున్న చదువులు

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ రోజుల తరబడి కొనసాగుతుండడంతో ఆయా పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లు లేక బోధన అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియపై ప్రతిష్టంభన నెలకొంది. ఈ నెల 8న ఈ ప్రక్రియ ప్రారంభించినా.. ఇప్పటికీ కొలిక్కిరాని పరిస్థితి నెలకొంది. ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈనెల 27వ తేదీ నుంచి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఫార్మేటివ్-1 పరీక్షను నిర్వహించనున్నారు. చాలా పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లు లేక సిలబస్ పూర్తి కాని పరిస్థితి ఉంది.

### జిల్లాలో 9 వేల మందికి పైగా టీచర్లు

జిల్లాలో ఉన్న 2,592 ప్రభుత్వ పాఠశాలల్లో 1,81,392 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో 9 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా గత ప్రభుత్వం 3 నుంచి 5వ తరగతులను సమీపంలోని హైస్కూల్స్‌ల్లో విలీనం చేసింది. ఆయా పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత లేకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసింది.

### ఉపాధ్యాయుల అభ్యంతరాలివి



జీఓ నంబరు 117ను రద్దు చేసి సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలి. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల కొరత ఏర్పడిన నేపథ్యంలో అర్హత కలిగిన ఎస్జీటీలకు పదోన్నతి కల్పించి ఆ తర్వాత సబ్జెక్ట్ టీచర్లుగా నియమించాలి. ఎంపీపీ, జెడ్పీ పాఠశాలల్లో మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను మున్సిపల్ పాఠశాలల్లోకి డిప్యూటేషన్ మీద సర్దుబాటు చేస్తున్నారు. మున్సిపల్ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను ఎంపీపీ, జెడ్పీ పాఠశాలల్లోకి సర్దుబాటు చేస్తున్నారు. ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, ఈ రీతిలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం సరికాదంటూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లాలో 870 మందికి పైగా మిగులు టీచర్లు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 9వ తేదీ నాటికి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయనున్నారు. మిగులు పోస్టులకు కేడర్ (సర్వీసు) సీనియార్టీ ప్రతిపాదికన తీసుకుంటున్నారు. వీరిలో జూనియర్లను మాత్రమే మిగులు టీచర్లగా నిర్ధారించనున్నారు. జిల్లాలో మొత్తం 870 మంది మిగులు ఉపాధ్యాయులు ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు లెక్క తేల్చారు. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్లకు మండలాల వారీగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. గురువారం నాటికి జిల్లాలో 28 మండలాల్లో సర్దుబాటుకు ఉపాధ్యాయులు ఆప్షన్లు పెట్టుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత క్వాలిఫైడ్ సెకండరీ గ్రేడ్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి మండలాల్లోని పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరతకు సర్దుబాటు చేయనున్నారు.

### పాత జీఓ ప్రకారం మిగులు టీచర్లను తేల్చాలి



జీఓ 53 ప్రకారం మిగులు టీచర్లను తేల్చాలి. ఆ మేరకు మాత్రమే పని సర్దుబాటు ప్రక్రియలో ముందుకెళ్లాలి. జీఓ 117 ప్రకారం సర్దుబాటు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదు. ఇప్పటికే ఆయా మండలాల్లో నిర్వహించిన సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఫ్యాప్టో ఆధ్వర్యంలో బాయ్‌కాట్ చేశాం.

– నవకోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

### సర్దుబాటును నిలిపివేయాలి



ఉపాధ్యాయుల సర్దుబాటును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలి. సర్దుబాటు ప్రక్రియ అశాస్త్రీయంగా ఉంది. అధికారులు మంత్ర దండంతో ఉపాధ్యాయులను భయ పెట్టి సర్దుబాటు పేరుతో దూర ప్రాంతాలకు పంపిస్తే సహించేదిలేదు. అర్హులైన ఎస్జీటీలకు వెంటనే పదోన్నతులు కల్పించి ఉపాధ్యాయుల కొరతను అధిగమించాలన్నదే మా డిమాండ్.

– మోహన్‌దాస్, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు

### తొలుత మండల యూనిట్‌గా తీసుకుంటాం

సర్దుబాటు ప్రక్రియలో తొలుత మండలాల్లో మిగులు ఉన్న పాఠశాలల నుంచి కొరత ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశాలు వచ్చాయి. మండలాల్లో పూర్తయిన తర్వాత మిగులు ఉంటే డివిజన్, జిల్లా స్థాయిలో తీసుకుంటాం. త్వరలో సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం.

– పీవీజే రామారావు, డీఈఓ

## న్యూస్‌రీల్

### ఆలయాల ఆస్తుల పరిరక్షణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల ఆస్తులు, భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా స్థాయి దేవదాయశాఖ భూముల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆలయాలకు సంబంధించి అన్యాక్రాంతమవుతున్న ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ఆత్మకూరులోని కొలగాని రామయ్య సత్రం భూముల ఆక్రమణ, దుకాణాల తొలగింపుపై దృష్టి సారించాలన్నారు. తొలుత దుకాణాలను తొలగించాలని సూచించారు. పేదలు ఆక్రమించి ఉంటే వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ స్థలాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ఆలయాల పరిధిలో ఆస్తుల పరిరక్షణకు కమిటీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి, ఏఎస్పీ సౌజన్య, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జె.శ్రీనివాసరావు, డీపీఓ సుస్మిత, ఆత్మకూరు ఆర్డీఓ మధులత, కావలి ఆర్డీఓ శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి రాష్ట్ర స్థాయి టీ 20 క్రికెట్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే సునీల్ కుమార్ స్మారక రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వెటరన్ టీ 20 క్రికెట్ పోటీలకు సర్వం సిద్ధంగా ఉన్నామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పి.భానుప్రకాష్‌రెడ్డి బుధవారం తెలిపారు. బుజబుజనెల్లూరులోని సీఐపీ క్రికెట్ మైదానంలో జరిగే ఈ పోటీల్లో హైదరాబాద్, అనంతపురం, కడప, గుంటూరు, కృష్ణ, నెల్లూరు జిల్లాలకు చెందిన వెటరన్ క్రికెట్ జట్లు తలపడనున్నాయన్నారు. భోజన, వసతి ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఈ పోటీలకు రంజీ, రాష్ట్ర స్థాయికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. క్రికెట్ అసోసియేషన్ నియమనిబంధనలకు అనుగుణంగా పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు.

### కండలేరుకు నీటి విడుదల



నీటి విడుదల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి

సోమశిల: సోమశిల జలాశయం నుంచి కండలేరుకు బుధవారం ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో దక్షిణ కాలువ వద్ద పూజలు నిర్వహించి 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సోమశిల జలాశయానికి కృష్ణా జలాలు రావడంతో 9 టీఎంసీలు ఉన్న నీటి మట్టం 25 టీఎంసీలకు చేరుకుంది. కండలేరు సైతం అత్యంత డెడ్ స్టోరేజీకి చేరడంతో పాటు చెన్నై, తిరుపతి నగరాలకు తాగునీటిని విడుదల చేయాల్సి ఉన్న క్రమంలో సోమశిల నుంచి కండలేరుకు తరలించేందుకు నీటి విడుదలకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సోమశిల ఈఈ దశరథరామిరెడ్డి, డీఈ రవీంద్రబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

### అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్ల స్వాధీనం



పట్టుబడిన మట్టి టిప్పర్లు

కొడవలూరు: ఎలాంటి అనుమతుల్లేకుండా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను కొడవలూరు పోలీసులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. విడవలూరు మండలం రామతీర్థం సమీపంలో అక్రమంగా మట్టి తవ్వి కొడవలూరు మీదుగా తరలిస్తున్నారని తహసీల్దార్ స్ఫూర్తికి అజ్ఞాత వ్యక్తులు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె స్థానిక ఎస్సై హనీఫ్‌అహ్మద్‌ను అప్రమత్తం చేశారు. ఎస్సై కొడవలూరు పెట్రోలు బంకు వద్ద తనిఖీలు చేపట్టి రెండు మట్టి టిప్పర్లను పట్టుకున్నారు. తహసీల్దార్ స్ఫూర్తికి సమాచారం అందించడంతో ఆమె అక్కడికి చేరుకొని మట్టి తరలింపునకు అనుమతులు చూపాలని కోరారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్లను పోలీసులకు అప్పగించారు.

# జూడాల రిలే నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న డాక్టర్లు, ప్రజా సంఘాల నాయకులు

• న్యాయం జరిగేంత వరకు ఆందోళన కొనసాగిస్తాం

నెల్లూరు(అర్బన్): కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాల పీజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రి వద్ద పలువురు జూనియర్ డాక్టర్లు బుధవారం నల్ల దుస్తులు ధరించి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారికి మద్దతుగా మిగతా జూడాలు ధర్నా చేశారు. జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జునైద్ అలీ అహ్మద్ మాట్లాడుతూ తాము ఆరు రోజులుగా న్యాయం చేయాలని కోరుతూ ఆందోళనలు చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డాక్టర్ల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదన్నారు. ప్రభుత్వ డాక్టర్ల సంఘం తరఫున డాక్టర్ కాలేషాబాషా, డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ నిత్యం తాము అభద్రత నడుమ విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. డాక్టర్లపై దాడులు చేయడం సిగ్గు చేటన్నారు. మహిళా డాక్టర్ల రక్షణ విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మెకు తాము పూర్తి మద్దతిస్తామన్నారు. యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సతీష్, సంధాని, జనవిజ్ఞాన వేదిక నాయకులు మాదాల రాము తదితరులు జూడాల ధర్నాలో పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. రాత్రి జూనియర్ డాక్టర్లు ఏసీ స్టేడియం, కేవీఆర్ పెట్రోల్ బంక్ మీదుగా ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు.

### పశుసంచార అంబులెన్స్ పైలట్ పోస్టుల భర్తీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని ఏపీ 1962 పశుసంచార అంబులెన్స్ వాహనాల్లో ఖాళీగా ఉన్న పైలట్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టామని ఆ శాఖ మేనేజర్ శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై హెవీ లైసెన్సు లేదా బ్యాడ్జీ లైసెన్సు కలిగిన 40 ఏళ్ల లోపు వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24న స్థానిక రైల్వేఫీడర్స్ రోడ్డులోని జిల్లా పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఉన్న 1962 ఆఫీస్‌లో సంప్రదించాలని కోరారు. వివరాలకు 97041 65512 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### 734 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 734 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 821 బేళ్లు వచ్చాయన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 97,339.1 కిలోల పొగాకు విక్రయించగా రూ.305,75,641.30 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.204 లభించింది. సగటు ధర రూ.314.11గా నమోదైంది. వేలంలో 14 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేర్లను తొలగించడం అన్యాయం

• ప్రజల మనోభావాలను అవమానించినట్లే
• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): నెల్లూరు, సంగం బ్యారేజీలకు నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి పేర్లను తొలగించడం అన్యాయమని, జిల్లా ప్రజల మనోభావాలను తీవ్రంగా అవమానించినట్లేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1983లో టీడీపీ బలోపేతానికి కృషి చేసి నెల్లూరు జిల్లాలో సాగు, తాగునీటికి అనేక ప్రాజెక్ట్‌ల నిర్మాణంలో కీలకపాత్ర పోషించినటువంటి నేత దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆయన ప్రజల కోసం జీవించిన మనిషి, రాజకీయాల్లో నిస్వార్థంగా సేవ చేసి రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువచ్చిన ఘనత నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డిదన్నారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి ఎంతో సౌమ్యుడని, ఆనాటి ప్రతిపక్ష నేతతో సహా ప్రతి ఒక్కరూ ఆయన్ను కీర్తించిన విషయం తెలిసిందేనన్నారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి వివాదరహితుడిగా జిల్లా ప్రజల మన్ననలను అందుకున్నారన్నారు. స్వల్ప కాలంలోనే ఒక మంచి నాయకుడిగా గుర్తింపు పొంది జిల్లా కీర్తిని రాష్ట్ర వ్యాప్తంగా చాటిన విషయం తెలిసిందేనన్నారు. సంగం, నెల్లూరు బ్యారేజీలను సకాలంలో పూర్తి చేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి పోషించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. ఇటువంటి వారి కీర్తి ప్రతిష్టలు చిరకాలం ఉండిపోవాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బ్యారేజీలకు వారి పేర్లను పెట్టిందన్నారు. ఈ నిర్ణయం జిల్లా ప్రజలు, రైతాంగం ఆమోదయోగ్యమైందన్నారు. అయితే దివంగత నేతలను, జిల్లా ప్రజలను అవమానించే రీతిలో నెల్లూరు, సంగం బ్యారేజీలకు ఉన్న పేర్లను తొలగించడం జిల్లా ప్రజలను అవమానించేనట్లేనన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి వారి పేర్లను కొనసాగించేలా నిర్ణయం తీసుకుంటారని వైఎస్సార్‌సీపీ ఆకాంక్షిస్తుందన్నారు. ప్రజల అభిప్రాయానికి భిన్నంగా మీరు వారి పేర్లను తొలగిస్తే.. తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, వారి పేర్లతో బ్యారేజీలకు కొనసాగిస్తామన్నారు.

# అనుమతి కొంత.. తవ్వేది చెరువంత



పొట్టేపాళెం వద్ద నెల్లూరు చెరువులో మట్టి తవ్వుతున్న జేసీబీ, రవాణాకు సిద్ధంగా టిప్పర్లు

• పొట్టేపాళెం సమీపంలో నెల్లూరు చెరువులో నల్లమట్టి తవ్వకాలు
• 600 క్యూబిక్ మీటర్ల మేర తవ్వకానికి అనుమతి
• రోజుకు వంద టిప్పర్లతో తరలిస్తున్న టీడీపీ నేతలు

నెల్లూరు సిటీ: టీడీపీ నేతల ధనదాహానికి అంతూ పంతు లేదు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని సహజ వనరుల దోపిడీలో చెలరేగిపోతున్నారు. మట్టి తవ్వకాలతో ప్రతిష్టాత్మకమైన నెల్లూరు చెరువును కుళ్లబొడుస్తున్నారు. కొందరు టీడీపీ నాయకులు నెల్లూరు చెరువులో నల్ల మట్టి తవ్వకానికి సంబంధించి 600 క్యూబిక్ మీటర్ల మేర తవ్వుకునేందుకు అనుమతి తీసుకున్నారు. దీన్ని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా తవ్వుకుని మట్టిని అమ్ముకుంటున్నారు. వారం రోజులుగా ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వేస్తున్నారు. రోజుకు 80 నుంచి 100 టిప్పర్ల మట్టిని ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. నెల్లూరు నుంచి నరసింహస్వామి కొండ వైపు వెళ్లే మార్గంలో పొట్టేపాళెంకు సమీపంలో నెల్లూరు చెరువులో వారం రోజులుగా ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా రెండు జేసీబీలు, 15కు పైగా టిప్పర్లు పెట్టి తవ్వి నల్లమట్టిని తరలిస్తున్నారు. ఒక్కో లోడ్‌ను రూ.15 వేలకు విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఒక్క రోజుకు సుమారుగా రూ.15 లక్షలకు పైగా కొల్లగొట్టుతున్నారు. టీడీపీ నేతల వ్యవహారంపై స్థానిక గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును సంప్రదించగా, తాము 600 క్యూబిక్ మీటర్లు మట్టి తవ్వకానికి మాత్రమే అనుమతిచ్చాం. వారం రోజుల పాటు జరుపుకోవాల్సి ఉంది. నిబంధనలకు అతిక్రమించి తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ట్రిపుల్ ఎఫ్ పామాయిల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

• ఎగసిన మంటలను అదుపులోకి తెచ్చిన సిబ్బంది

ముత్తుకూరు: మండలంలోని పంటపాళెం పంచాయతీ పోర్టు బైపాస్‌రోడ్డులోని ట్రిపుల్ ఎఫ్ పామాయిల్ ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో వేస్ట్ చమురుతో జెర్సీ ఆవుల మేత తయారు చేసే ప్లాంట్‌లో ఉష్ణోగ్రతలు పెరిగి మంటలు రేగాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో పరిసరాలు దట్టమైన పొగతో నిండిపోయాయి. పక్కనే ఉన్న వరి పొట్టు నిల్వలు సైతం మండుకోవడంతో అగ్ని కీలలు నలువైపులా వ్యాపించాయి. రాత్రి వేళ కార్మికులు ఎవరూ లేకపోవడం వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఫ్యాక్టరీలోకి ఎవరిని వెళ్లనీయకుండా సెక్యూరిటీ సిబ్బంది కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపులోకి తెచ్చారు. కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి తన సిబ్బందితో ఘటన స్థలాన్ని పరిశీలించి, విచారించారు. ఏ మేరకు నష్టం జరిగిందనే విషయాన్ని నిర్వాహకులు బయట పెట్టలేదు.



# అక్రమార్జనే ధ్యేయం..

• ఇష్టారాజ్యంగా ఇసుక తరలింపు
• యువకుడ్ని ఢీకొన్న ట్రాక్టర్
• బైక్ అడ్డుపెట్టి ట్రాక్టర్లను నిలిపివేసిన వైనం




టీకేపాడు గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో ఇసుకాసులు రెచ్చిపోతున్నారు. పట్టించుకునే నాథుడే కరువు కావడంతో ఇష్టారాజ్యంగా అక్రమ రవాణాతో రోజుకు రూ.లక్షల్లో కొల్లగొట్టుతున్నారు. టీడీపీ నాయకులు చేజర్ల మండలం తూర్పుకంభంపాడు పెన్నానది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. చాకిరేవు కట్ట వద్ద ఇసుకను డంప్ చేసి అక్కడ నుంచి టిప్పర్ల ద్వారా చెన్నై, బెంగళూరుకు తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్ రీచ్ వద్దకు వేగంగా వెళ్తూ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని ఢీకొట్టి, ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో ఆ యువకుడు ఇసుకను డంప్ చేసే సెంటర్ వద్ద ట్రాక్టర్లను రానీయకుండా బైక్‌ను అడ్డుపెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అర్ధరాత్రి సమయంలో గ్రామంలో కొద్దిసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని యువకుడికి సర్దిచెప్పి పంపేశారు. అనంతరం ట్రాక్టర్లను ఇసుక తోలకుండా పంపించేశారు. ట్రాక్టర్ తగిలి గాయపడిన యువకుడు, ఇసుకను అక్రమంగా తరలించే వారు ఒకే వర్గానికి చెందిన వారు కావడంతో పోలీసులు సైతం సర్దుకున్నారు. కొద్ది రోజులుగా గ్రామానికి సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలించడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి కొంత ఉద్రిక్తత నెలకొనడంతో బుధవారం నుంచి రూట్ మార్చి పెన్నలోనే కొంత దూరం వెళ్లి పల్లెకాపు మీదుగా ఉలవపల్లికి ఇసుకను తరలించి అక్కడ నుంచి టిప్పర్లలో దూర ప్రాంతాలకు తరలించేలా స్థానిక టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. ఈ విషయాలపై మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన కొందరు మైనింగ్ ఏడీకి ఫోన్ చేసి చెప్పగా తనకు వాహనం లేదని, ఈ సమయంలో రాలేనని సమాధానం చెప్పినట్లు గ్రామస్తులు చెప్పడం గమనార్హం. తొలి నుంచి టీడీపీలో చురుగ్గా ఉన్న ఓ యువకుడు ఇసుకను తరలించే విషయంలో చొరవ చూపుతుండేవాడు. దీంతో గ్రామానికి చెందిన ముగ్గురు టీడీపీ నాయకులు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున నెలకు ఒకటిన్నర లక్ష ఇవ్వాలని, ఇసుకను తరలించుకోవచ్చునని ఆ యువకుడితో అన్నారు. దీంతో మండిపడిన ఆ యువకుడు తాను తొలి నుంచి టీడీపీలో ఉన్నానని, మీరు చెప్పినట్లు వినాల్సిన అవసరం నాకు లేదని వారికి ఎదురు తిరగడంతో ప్రస్తుతానికి సర్దుకున్నారు.

| నిమ్మ ధరలు | |
|---|---|
| పెద్దవి: | రూ.120 |
| సన్నవి: | రూ.80 |
| పండ్లు: | రూ.60 |

| పౌల్ట్రీ ధరలు | |
|---|---|
| బ్రాయిలర్: | రూ.123 |
| లేయర్ | రూ.105 |
| బ్రాయిలర్ చికెన్ | రూ.222 |
| స్కిన్‌లెస్ చికెన్ | రూ.244 |
| లేయర్ చికెన్ | రూ.178 |











# టీకాతో గాలికుంటుకు చెక్

- జిల్లాలో 5.74 లక్షల పశువులకు వ్యాక్సినేషన్ ప్రారంభం
- సెప్టెంబర్ 20లోపు పూర్తి చేసేందుకు ప్రణాళిక
- నాలుగు నెలలు నిండిన దూడలకూ..



పొట్టేపాళెంలో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): పశువులు, జీవాలను వేధిస్తున్న అంటువ్యాధుల్లో ప్రమాదకరమైంది గాలికుంటు. దీన్ని ముందస్తుగా నివారించేందుకు గానూ జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేసేలా ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. వచ్చే నెల 20 వరకు టీకాలను వేయనున్నారు. ఈ వ్యాధి సోకితే చికిత్స లేదు. పశువులకు టీకాలను ముందుగా వేయించడం ద్వారా గాలికుంటు వ్యాధికి చెక్ పెట్టొచ్చని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

**వ్యాధి ప్రమాదకరం**

సాధారణంగా వర్షాలు కురిసే తొలినాళ్లలో అంటే ఆగస్టులో.. మంచు కాలం చివరి దశ ఫిబ్రవరిలో పశువులకు గాలికుంటు వ్యాధి ఎక్కువగా సోకుతుంది. జిల్లాలోని పలు గ్రామాల్లో పశువులకు అక్కడక్కడా గాలికుంటు వ్యాధి ప్రస్తుతం సోకింది. ఇది వైరస్ వల్ల వ్యాపిస్తుంది. గాలి, కలుషిత నీటి ద్వారా సైతం సోకేందుకు అవకాశం ఉంది. దేశవాళి పశువుల కన్నా సంకర, విదేశీ పశువుల్లో ఈ వ్యాధి మరింత వేగంగా వ్యాపిస్తుంది.

**జిల్లాలో ఇలా..**

జిల్లాలో 5.74 లక్షల పశువులకు టీకాలను వేసేలా ప్రణాళికను రూపొందించారు. నాలుగు నెలలు నిండిన దూడలకు వ్యాక్సిన్ వేసేలా చర్యలు చేపట్టారు. మండలానికి నాలుగు పశువైద్య టీముల చొప్పున ఏర్పాటు చేసి, వీరి ఆధ్వర్యంలో టీకాలు వేయనున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు.

**లక్షణాలు ఇలా..**

- పశువుల కాలి గిట్టలు, నోట్లో పుండ్లు ఏర్పడతాయి. మేత తినడాన్ని ఆపేస్తాయి.
- గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు 105, 106 డిగ్రీల జ్వరమొస్తుంది.
- పశువులు నీరసంగా ఉంటాయి.

**సంభవించే నష్టాలు**

పాల ఉత్పత్తి పడిపోయి, పని సామర్థ్యం తగ్గిపోతుంది. పాలు తాగే దూడల్లో మరణాలు సంభవిస్తాయి. వైద్యసేవలు సకాలంలో అందకపోతే పెద్ద పశువులు సైతం మృత్యువాత పడతాయి.

**జాగ్రత్తలు తప్పనిసరి**

గాలికుంటు వ్యాధి సోకిన పశువులపై రైతులు తగు జాగ్రత్తలు చేపట్టాలి. వీటిని వేరు చేసి దూరంగా ఉంచాలి. మేత మేయలేవు కాబట్టి జావలాంటి ఆహారాన్ని అందించాలి. దూడలు పాలు తాగకుండా చూడాలి. పశువుల షెడ్లను వాషింగ్ సోడాతో శుభ్ర పర్చాలి. తద్వారా వైరస్ నశించిపోతుంది.

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి**



జిల్లాలోని పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలను వేసే కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించాం. నెల పాటు ప్రక్రియ జరగనుంది. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకొని తమ పశువులకు టీకాలను వేయించాలి.

– కోటేశ్వరరావు, జేడీ, పశుసంవర్ధక శాఖ

# యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న సుబ్బారావు

నెల్లూరు(క్రైమ్): బీవీనగర్ రైల్వే గేట్ సమీపంలోని పట్టాల వద్ద జరిగిన యువకుడు హత్య పాతకక్షల నేపథ్యంలోనే జరిగిందని పోలీసుల విచారణలో వెల్లడైంది. కేసులోని నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో నిందితుల వివరాలను ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు బుధవారం వెల్లడించారు. బీవీనగర్‌లోని శ్రీచైతన్య హాస్టల్ సమీపంలో మన్నేపల్లి వేణు (23) తన అమ్మమ్మ హాజరత్తమ్మ ఇంట్లో నివాసం ఉంటూ బేల్దారి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. బీవీనగర్ రైల్వే గేట్ సమీపంలోని పట్టాల వద్ద ఈ నెల 14వ తేదీ రాత్రి దారుణహత్యకు గురయ్యారు. మృతుడి మేనమామ రమేష్ ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. సాంకేతికత ఆధారంగా బీవీనగర్‌లోని అనగుంటకు చెందిన మహేష్, ముదస్సర్ అహ్మద్, ఉమ్మారెడ్డిగుంటకు చెందిన ప్రవీణ్, మరో ఇద్దరు జువెనైళ్లను నిందితులుగా గుర్తించారు. మహేష్, ప్రవీణ్, ముదస్సర్ అహ్మద్‌ను అరెస్ట్ చేయగా, ఇద్దరు జువెనైళ్లను కస్టడీలోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తులు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని తమదైన శైలిలో విచారించగా హత్యకు దారితీసిన పరిస్థితులు, హత్య చేసిన తీరును వివరించారు.

**పద్ధతిగా జీవించమన్నందుకే..**

బీవీనగర్ రైల్వేగేట్ సమీపంలోని దుకాణాల వద్ద నిందితులు కూర్చొని అటుగా రాకపోకలు సాగించే వారిపై దౌర్జన్యంగా వ్యవహరించడంతో పాటు మహిళలను వేధింపులకు గురిచేయసాగారు. విషయాన్ని గమనించిన వేణు ఇది మంచి పద్ధతి కాదని వారికి సూచించారు. దీంతో అతనితో నిందితులు గొడవపడ్డారు. అప్పటి నుంచి వేణును ఎలాగైనా హత్య చేయాలని వేచి చూడసాగారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో వేణు సమీపంలోని జ్యూస్‌షాపు వద్దకెళ్లారు. విషయాన్ని గమనించిన నిందితులు వేచిచూడసాగారు. ఇంటికెళ్తున్న వేణును అడ్డుకొని తమ వెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణరహితంగా పొడిచి హత్య చేసి పరారయ్యారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్, ఏఎస్సై ప్రసాద్, హెచ్‌సీలు సుబ్బారావు, మునిరావు, పీసీలు మాల కొండయ్య, గోపాలయ్య, నాగరాజును ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు..

# న్యాయం జరిగేంత వరకు పోరాడతాం



వివరాలను తెలుసుకుంటున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు న్యాయం జరిగేంత వరకు పోరాడతామని పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ 19వ డివిజన్ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణకు చెందిన వాటర్ ప్లాంట్‌ను కార్పొరేషన్ అధికారులు ఇటీవల సీజ్ చేసిన నేపథ్యంలో ముత్యాలపాళెంలోని ఆయన నివాసానికి ఆదాల బుధవారం వచ్చారు. వాటర్ ప్లాంట్ నిర్వహణకు అన్ని అనుమతులున్నా, ఎలాంటి నోటీసులను ఇవ్వకుండానే అధికారులు సీజ్ చేశారని బాధితుడు వాపోయారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడారు. అన్యాయాన్ని కమిషనర్‌కు తెలియజేసి, న్యాయం జరిగేంత వరకు పోరాడతామని భరోసా ఇచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ నేత మలిరెడ్డి కోటారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, స్వర్ణ వెంకయ్య, లేబూరు పరమేశ్వరరెడ్డి, హరిబాబుయాదవ్, పాశం శ్రీనివాస్, చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కెమికల్ లీకేజీ మేనేజ్‌మెంట్‌పై మాక్‌డ్రిల్



ముత్తుకూరు: ఫ్యాక్టరీల్లో కెమికల్.. ఎల్పీజీ గ్యాస్ లీకేజీ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తూ మాక్‌డ్రిల్‌ను బుధవారం నిర్వహించారు. కృష్ణపట్నం పెట్రో గ్యాస్ ప్రైవేట్ సంస్థలో కార్యక్రమాన్ని జరిపారు. ముగ్గురు కార్మికులు గాయపడితే.. ప్రాథమిక చికిత్స అనంతరం ముత్తుకూరు పీహెచ్‌సీకి తరలించేలా మాక్‌డ్రిల్ చేశారు. ఆర్డీఓ మలోల, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్, డీపీఎం వీరశేఖర్, పరిశ్రమ మేనేజర్ జీవీ రావు, సచిన్‌చాటి తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా రేపు

నెల్లూరు(బారకాసు): నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాను శుక్రవారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి వినయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్‌లో వివిధ రకాల పోస్టులకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. క్రెడ్ రైట్ ఫైనాన్స్ కంపెనీలో లోన్ ప్రాసెస్ ఆఫీసర్, ట్రెయినీ అధికారిగా పనిచేసేందుకు ఏదైనా డిగ్రీ చదివి, 20 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ అండ్ ఆఫీస్ అసోసియేట్ పోస్టులకు పదో తరగతి నుంచి డిగ్రీ లేదా ఎంబీఏ చదివిన 20 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని వివరించారు. ఇంటర్వ్యూలకు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డును తీసుకురావాలని సూచించారు.


# జిల్లాలో ఎక్కడా విద్యుత్ కోతల్లేవు



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్ పరిధిలో విద్యుత్ కోతలు ఎక్కడా లేవని ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. జిల్లాకు రోజుకు 200 లక్షల యూనిట్లను కేటాయించగా, వారం రోజులుగా 15 ఎంయూలే వినియోగంలో ఉందని చెప్పారు. సరఫరాలో ఎలాంటి ఫిర్యాదులున్నా, టోల్‌ఫ్రీ నంబర్ 1912 లేదా వాట్సాప్ నంబర్ 91333 31912ను సంప్రదించాలని సూచించారు. ప్రతి నెలా రెండో శనివారాన నిర్వహణ పనులను చేపట్టనున్నామని, ఇదే విషయమై వినియోగదారులకు సమాచారాన్ని అందజేస్తున్నామని తెలిపారు.

# పురుగుమందు సేవించి ఆత్మహత్య



సీతారామపురం: స్థానిక మండల కార్యాలయాల సమీపంలోని ఓ లాడ్జిలో పురుగుమందు సేవించి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కొమరోలుకు చెందిన జలీల్ (58) తన అత్త గ్రామమైన రంగనాయుడుపల్లిలో వివాహానికి హాజరయ్యేందుకు గానూ మంగళవారం రాత్రి వచ్చారు. ఈ క్రమంలో సీతారామపురంలోని లాడ్జిలో బసచేశారు. గది తలుపులను బుధవారం తీయకపోవడాన్ని లాడ్జి సిబ్బంది గమనించారు. తలుపు గడియ తీసిచూడగా, నోటి నుంచి నురుగు వస్తుండటంతో పోలీసులకు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఎస్సై అనూష తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# ఎస్సీ వర్గీకరణ చేస్తే తప్పేమిటి..?



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్సీ వర్గీకరణ చేస్తే తప్పేమిటని.. సుప్రీం కోర్టును ధిక్కరించిన వారిపై రాజద్రోహం కేసు నమోదు చేయాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ కోరారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎస్సీ జాబితాలో ఉన్న 59 కులాలకు సామాజిక న్యాయం జరిగేలా వర్గీకరణ చేస్తే తప్పేముందని ప్రశ్నించారు. విద్య, ఉద్యోగాల్లో మాదిగలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు చెల్లదని వాదిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. నేతలు ఆనందరావు, చిన్నయ్య, పిచ్చయ్య, నాగార్జున, కన్యకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చౌర్యంపై దాడులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా సర్కిల్ పరిధిలో విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ అధికారులు దాడులను బుధవారం నిర్వహించారు. సైదాపురం, పొదలకూరు గూడూరు, నెల్లూరు టౌన్, రూరల్ ప్రాంతాల్లో 42 కేసులను నమోదు చేసి రూ.2.3 లక్షల అపరాధ రుసుము విధించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జగదీష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 10 నుంచి వాలీబాల్ పోటీలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ ఇంటర్ సర్కిల్ వాలీబాల్ పోటీలను రాజమహేంద్రవరంలో వచ్చే నెల పది నుంచి 12 వరకు నిర్వహించనున్నామని సంస్థ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ వేలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ భవన్‌లో ట్రయల్స్‌ను శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల విద్యుత్ కార్మికులు, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ – 2 సిబ్బంది హాజరుకావాలని కోరారు.

### విద్యాసంస్థల బస్సులపై కేసులు నమోదు



నెల్లూరు (టౌన్): నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై తనిఖీలను రవాణా శాఖ అధికారులు బుధవారం చేపట్టారు. నగరంలోని ముత్తుకూరు గేట్ సెంటర్, అయ్యప్పగుడి, నవాబుపేట ప్రాంతాల్లో తనిఖీలను నిర్వహించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, త్రైమాసిక పన్ను చెల్లించని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న నాలుగు విద్యాసంస్థల బస్సులపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుముగా రూ.1.5 లక్షలను వసూలు చేశారు. ఎమ్వీఐలు గోపీనాయక్, రాంబాబు, విఘ్నేశ్వర్ లాల్, ఏఎమ్వీఐలు స్వప్నిల్‌రెడ్డి, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం



ఆర్టీసీ వద్ద మాలమహానాడు నేతల ధర్నా

నెల్లూరు సిటీ / నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ఎస్సీ వర్గీకరణను అడ్డుకొని తీరుతామని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణ వెంకయ్య పేర్కొన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్‌ను బుధవారం చేపట్టారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాలమహానాడు, మాల విద్యార్థి సంఘం, మాల ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బంద్‌ను పాటించారు. పోలీస్ బలగాలను భారీగా మోహరించారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, వెంకయ్య, రవిచంద్ర, అశోక్‌నాయుడు, శరత్, సుజాత, పద్మ, గోపాల్, స్వర్ణ తులసి, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

### మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బదిలీ



సాయినాథ్

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్న సాయినాథ్ చిత్తూరు డీఎస్పీగా బదిలీ అయ్యారు. కాగా ఈయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు.

### చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



వరికుంటపాడు: మండలంలో రోడ్డు వెంబడి ఉండే హోటళ్లు, దుకాణాలు, గృహాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని వరికుంటపాడు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్సై తిరుపతయ్య వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం రామగోపాలపురానికి చెందిన మహేందర్‌రెడ్డి అనుమానాస్పదంగా తిరుగుతుండగా, అరెస్ట్ చేశామని చెప్పారు. అనంతరం ఉదయగిరి కోర్టులో హాజరపర్చామని తెలిపారు. అతని వద్ద రూ.ఐదు వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

**కందుకూరు పురపాలక సంఘం**

**హెచ్చరిక**

ప్రజలకు తెలియజేయడము ఏమనగా ఈ క్రింది జాబితాలో పొందుపరచిన స్థలము/ప్లాట్లు ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారముగా లే అవుట్లు వేసియున్నారు.

| క్ర. సం. | అనధికార లే అవుట్ పేరు | విస్తీర్ణము | సర్వే నెంబరు | గ్రామము | మండలము |
|---|---|---|---|---|---|
| 1. | -- | 1.62 | 122/2B1A, 122/2B1B, 122/2B2B, 122/2B3B | కందుకూరు | కందుకూరు |
| 2. | -- | 3.11 | 711&712/3 | కందుకూరు | కందుకూరు |
| 3. | -- | 1.25 | 286/3B,286/2B10 | కందుకూరు | కందుకూరు |
| 4. | -- | 1 | 276/3C,276/3M | కందుకూరు | కందుకూరు |
| 5. | -- | 1 | 893/A1, 891/1 | కందుకూరు | కందుకూరు |
| 6. | -- | 3.7 | 878/1,878/2,878/3, 878/4,881/1 & 881/2 | కందుకూరు | కందుకూరు |

కావున పైన తెలియపరచిన లేఔట్ల నందు స్థలము లేక ప్లాట్లు కొనుగోలు చేయుట చట్ట విరుద్ధము మరియు ఈ ప్లాట్లకు అమ్మకము, కొనుగోలుకు వీలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయబడవు మరియు ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు, మౌలిక వసతులు అనగా రోడ్లు, కరెంటు, నీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించబడవు. దీనిని గమనించవలసినదిగా విజ్ఞప్తి.

గమనిక: అనధికారముగా లే అవుట్ వేసి మరియు అమ్మకాలు చేయుచున్న స్థల యజమానుల లేదా డెవలపర్ల పైన చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయి.

కమీషనర్, కందుకూరు పురపాలక సంఘం.